క్లుప్తంగా

పంచారామ క్షేత్రంలో భక్తుల రద్దీ


సామర్లకోట పంచారామ క్షేత్రంలోని స్వామి వారు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో పిఠాపురం మహారాజా గోత్రనామాలతో అర్చకులు వేమూరి సోమేశ్వరశర్మ, కొంతేటి జోగారావు, సన్నిధిరాజు వెంకన్న, చెరుకూరి రాంబాబు, శ్రీకాకుళపు వినయ్ తొలి పూజ, అభిషేకాలు చేశారు. తరువాత భక్తుల పేరున అభిషేకాలను స్వామి వారికి నిర్వహించారు. అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. ఈఓ డి నాగమల్లేశ్వర రావు, ట్రస్టు బోర్డు సభ్యులు, దేవదాయశాఖ సిబ్బంది భక్తులకు సేవలందించారు. దేవస్థానం తరపున ఏర్పాటు చేసిన అన్నదానంలో అధిక సంఖ్యలో అయ్యప్ప, భవానీ దీక్షాధారులు పాల్గొన్నారు.

ప్రజల వద్దకే ప్రభుత్వ వైద్యం

ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ వైద్య సేవలు అందుతున్నాయని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. పిఠాపురం నియోజకవర్గంలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలపై సోమవారం వైద్యాధికారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక వైద్య సదుపాయాలను ప్రజల ముంగిటకే తీసుకురావడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. గ్రామాల్లో 45 రోజుల పాటు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహిస్తారన్నారు. ప్రజలకు ఏ ఆరోగ్య సమస్య ఉన్నా తగిన వైద్య సేవలందించాలని ఆయన వైద్యులకు సూచించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఇంటి వద్దకే వైద్యం


ఉండూరులో రోగులకు మందులు అందజేస్తున్న వైద్యాధికారులు, సర్పంచ్

సామర్లకోట: ప్రజలందరికీ నాణ్యమైన వైద్యం అందేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారని ఎంపీడీఓ డి.శ్రీలలిత అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఉండూరులో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ఆమె పాల్గొన్నారు. ఈఓపీఆర్డీ కర్రి హరికృష్ణ సత్యారెడ్డి, సర్పంచ్ పంతాడి ధనలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు నర్ల కొండలరావు, ఎంఈఓ పి పుల్లయ్య, పంచాయతీ కార్యదర్శి తోట సత్యనారాయణ, పంచాయతీ, మండల పరిషత్, హెల్త్, సచివాలయ సిబ్బంది రోగులకు సేవలందించారు. వేట్లపాలెం పీహెచ్‌సీ వైద్యులు ప్రశాంత్, శ్రీహిమవతి రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు.

20న మండల సమావేశం

పెద్దాపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 20న సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బి.అశోక్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు ఎంపీపీ పెంకే సత్యవతి అధ్యక్షతన జరిగే సమావేశానికి మండలంలోని ఆయా గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు వివిధ శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఎంపీడీఓ అశోక్‌కుమార్ కోరారు.

జెడ్పీ హైస్కూల్‌లో తుప్పల తొలగింపు


హైస్కూల్‌లో తుప్పలను తొలగిస్తున్న జేసీబీ

సామర్లకోట: స్థానిక బ్రౌన్‌పేటలోని జెడ్పీ బాలికల హైస్కూల్‌లో సోమవారం తుప్పలు తొలగించారు. పాఠశాలలో పాముల హల్‌చల్ అనే వార్తకు ఎంఈఓ వై శివరామకృష్ణయ్య స్పందించి పాఠశాలలో పెరిగిన తుప్పలను తొలగించకపోవడంపై హెచ్‌ఎం మీనా మాధురిని ప్రశ్నించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబా జాన్‌మోజెస్ సహకారంతో జేసీబీని ఏర్పాటు చేసి పాఠశాల ఆవరణలో పెరిగిన తుప్పలను తొలగిస్తున్నట్లు ఎంఈఓ తెలిపారు. ఇటువంటి సంఘటనలు జరుగకుండా ప్రతి పాఠశాలలోని ఆవరణలు పరిశుభ్రంగా ఉండేలా హెచ్‌ఎంలకు ఆదేశాలు ఇస్తున్నట్లు ఆయన తెలిపారు.

న్యాయవాదుల రిలే నిరాహార దీక్షలు


రిలే నిరాహార దీక్షలు చేపట్టిన న్యాయవాదులు

పిఠాపురం: బార్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఏకపక్ష నిర్ణయాలకు నిరసనగా పిఠాపురం బార్ అసోసియేషన్ న్యాయవాదులు రెండు రోజులుగా విధులు బహిష్కరించి నిరసన తెలుపుతున్నారు. దీనిలో భాగంగా సోమవారం కోర్టుల వద్ద రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. తమకు న్యాయం జరిగే వరకు కూడా విధులకు హాజరు కాకూడదని నిర్ణయించుకున్నట్టు పిఠాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజారావు తెలిపారు.


పాదగయ క్షేత్రంలో బాలాత్రిపురసుందరిగా దర్శనమిచ్చిన రాజరాజేశ్వరి దేవి


ప్రత్యేకాలంకరణలో పురుహూతికా అమ్మవారు


బ్రహ్మచారిణిగా అపర్ణాదేవి


గాయత్రీదేవిగా దర్శనమిస్తున్న నూకాలమ్మ తల్లి


కొమరగిరిలో పార్వతీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు

బాలాత్రిపురసుందరిగా జగన్మాత

పిఠాపురం: నియోజకవర్గంలో దేవీశరన్నవరాత్ర ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు సోమవారం అమ్మవారు బాలాత్రిపురసుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. దక్షిణకాశీగా విరాజిల్లుతున్న పాదగయ క్షేత్రం భక్తులతో కిటకిటలాడుతోంది. నియోజకవర్గంలోని కొత్తపల్లి గొల్లప్రోలు, పిఠాపురం మండలాల్లో కనకదుర్గ అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిరచారు. పాదగయ క్షేత్రంలో అలయ ట్రస్టుబోర్డు చైర్మన్ ఆగంటి ప్రభాకరరావు ఆధ్వర్యంలో అర్చకులు రాజరాజేశ్వరీదేవి, పురూహూతికా అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. మహాగణపతి, దత్తాత్రేయ, కుక్కుటేశ్వరస్వామి వార్లకు అభిషేకాలు నిర్వహించారు. పాదగయక్షేత్రంలోని రాజరాజేశ్వరీదేవి అమ్మవారు బాలాత్రిపురసుందరిగా భక్తులకు దర్శన మిచ్చారు. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. దసరా ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈఓ శ్రీనివాసరావు తెలిపారు.

బారులుతీరిన భవానీలు

పాదగయ క్షేత్రానికి సోమవారం భవానీ భక్తులు పోటెత్తారు. పాదగయ పుష్కరిణిలో పుణ్య స్నానాలాచరించిన భక్తులు అమ్మవారి దర్శనానికి బారులుతీరారు. తెల్లవారుజామున 4 గంటల నుంచి భవానీ మాల ధరించిన భక్తులు అమ్మవారి దర్శనానికి బారులు తీరడంతో పాదగయ క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది.

బ్రహ్మచారిణిగా అపర్ణాదేవి

పిఠాపురం: గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో వేంచేసిన అపర్ణాదేవి అమ్మవారు దసరా ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు సోమవారం బ్రహ్మచారిణిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఏక దళం, త్రిదళం, మహాదళాలతో అమ్మవారిని అలంకరించి విశేష పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సామర్లకోట: శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పట్టణ, మండల పరిధిలోని అమ్మవారి ఆలయాల్లో పూజలు కొనసాగుతున్నాయి. స్థానిక పంచారామ క్షేత్రం బాలా త్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం హోమం నిర్వహించారు. రెండో రోజు అమ్మవారిని అన్నపూర్ణదేవిగా అలంకరించారు. స్థానిక మెహర్ కాంప్లెక్స్‌లోని గణపతి ఆలయంలో మహాలక్ష్మి ఉపాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ లలితా సహస్ర నామ పారాయణ చేశారు. వైస్‌చైర్మన్ గోకిన సునేత్రదేవి, కౌన్సిలర్ రెడ్నం సునీత పాల్గొన్నారు. స్థానిక రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన శిబిరంలో, గాంధీచౌక్, బళ్లమార్కెట్ సెంటర్‌లో శిబిరాలతో పాటు బ్రౌన్‌పేటలోని కనకదుర్గ, బడేలమ్మ చెరువు వద్ద ఉన్న నవదుర్గ, నీలమ్మ చెరువు వద్ద ఉన్న సత్తెమ్మ తల్లి, అయోధ్యరామపురంలోని కనకదుర్గ, సత్తెమ్మ తల్లి, గాంధీనగర్‌లోని కనకదుర్గ, స్టేషన్ సెంటర్‌లోని నూకాలమ్మ ఆలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గాయత్రిదేవిగా అమ్మవార్లు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పు కాండ్రకోట నూకాలమ్మ, పెద్దాపురం మరిడమ్మ అమ్మవార్లు సోమవారం గాయత్రిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా ఆలయాల ఈఓలు సీహెచ్.రామ్మోహనరావు, టీవీ సూర్యనారాయణ ఆధ్వర్యంలో అమ్మవార్లను వేద పండితులు, ఆసాదులు గాయత్రిదేవిగా అలంకరించారు. స్థానిక వర్జుల వారి వీధిలోని శ్రీభువనేశ్వరి పీఠంలో అమ్మవారు గాయత్రీదేవిగా దర్శనం ఇచ్చారు.

కొత్తపల్లి: మండల వ్యాప్తంగా దేవీ శరన్నవరాత్ర ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు సోమవారం జగన్మాత బాలాత్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కొత్తపల్లి శ్రీధర్మశాస్తా ఆలయంలోని కనకదుర్గాదేవి, గాజులదొడ్డిలోని బాలదుర్గ, వాకతిప్ప, కుతుకుడుమిల్లి, యండపల్లి, కొండెవరం, ఉప్పాడ, మూలపేట తదితర గ్రామాల్లోని దుర్గాదేవి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కొమరగిరిలోని కనకదుర్గాదేవి పార్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

అన్నపూర్ణాదేవిగా బాలా త్రిపురసుందరి

సామర్లకోట: పంచారామ క్షేత్రంలో బాలాత్రిపుర సుందరి సమేత కుమార రామభీమేశ్వర స్వామి ఆలయంలోని అమ్మవారు సోమవారం అన్నపూర్ణదేవి దర్శనం ఇచ్చారు.


పాదగయ క్షేత్రానికి పోటెత్తిన భవానీ భక్తులు


సామర్లకోట మహాలక్ష్మి ఆలయంలో పారాయణ చేస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్, వైస్‌చైర్‌పర్సన్ తదితరులు


సామర్లకోట పంచారామ క్షేత్రంలో నిర్వహిస్తున్న చండీ హోమం

30 ఏళ్ల తరువాత స్థానిక అభ్యర్థిగా పోటీ

రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న దవులూరి దొరబాబు

సామర్లకోట: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రజలు తమ అభిమానాన్ని చాటి చెప్పుకొన్నారని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన విజయవంతం కావడంతో సోమవారం సాయంత్రం ఆయన స్థానిక పార్టీ క్యాంపు కార్యాలయం వద్ద విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఎన్నడూ లేని విధంగా లక్షలాది మంది జనం అభిమానంతో స్వచ్ఛందంగా తరలి వచ్చారని తెలిపారు. సీఎం తనకు పెద్దాపురం నియోజకవర్గం నుంచి పోటీ చేసే అవకాశం కల్పించడమే కాకుండా తనపై ఎంతో అభిమానాన్ని చూపారని, దానిని నేను ఎప్పటికీ మరువనన్నారు. 1985 తరువాత మొదటి సారిగా స్థానిక అభ్యర్థిగా తనను ప్రకటించడంతో తన 20 ఏళ్ల రాజకీయ చరిత్రకు ఒక అర్థం ఏర్పడిందన్నారు. ముఖ్యమంత్రి కోరుకున్న విధంగా ప్రతి ఇంటిలోను తన ఫొటో పెట్టుకునేలా నియోజకవర్గంలో పని చేస్తానని దొరబాబు ప్రకటించారు. తాను చదువుకున్న కళాశాలను డిగ్రీ కళాశాలగా మార్చే అదృష్టం తనకు దక్కడం ఎంతో ఆనందంగా ఉన్నదన్నారు. ముఖ్యమంత్రి పర్యటనకు అనేక గ్రామాల్లో జనం కోసం బస్సు ఏర్పాటు చేయలేక పోయామని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయడానికి కృషి చేసిన మంత్రులు, ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యేలకు, నియోజకవర్గ ప్రజలకు ఆయన పేరు పేరునా కృతజ్ఞత తెలిపారు. అయ్యారక కార్పొరేషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరి, పెద్దాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీమంగ తాయారు, వైస్ చైర్‌పర్సన్ గోకిన సునేత్రాదేవి, నెక్కంటి సాయిప్రసాద్, కనకాల మహాలక్ష్మి, ఎంపీపీ పెంకే సత్యవతి, వైస్ ఎంపీపీ పేర్నిడి వెంకట్రాయుడు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, సీనియర్ రాజకీయ నాయకుడు మన్యం చంద్రరావు, మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, పట్టణ పార్టీ అధ్యక్షుడు మద్దాల శ్రీను, సొసైటీ అధ్యక్షుడు మేకా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పథకాలతో ఇంటింటా ఆనందం

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- ఏకే మల్లవరంలో గడప గడపకూ మన ప్రభుత్వం


ఏకే మల్లవరంలో లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతిగడపలో ఆనందం కనిపిస్తోందని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. గొల్లప్రోలు మండలం ఏకే మల్లవరంలో సోమవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా ? లేదా ? అని ఆరా తీశారు. ఎమ్మెల్యే పెండెం దొరబాబుకు స్థానికులు ఘన స్వాగతం పలికికారు. సాధారణంగా పాలకులు ఎన్నికల్లో వస్తారు మళ్లీ కనిపించరు ఏదైనా పని కావాలంటే మేము వెళ్లినా పట్టించుకోరు కాని ఇప్పుడు మీరు మేము పిలవకపోయినా మా ఇంటికి వచ్చి సమస్యలు తెలుసకుంటున్నారని స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ప్రతి ఇంట్లో వారిని పలకరించి ఆ కుటుంబంలో ఎవరెవరికి ఏయే పథకాలు అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. గత నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి ఏదో ఒక పథకం వర్తించిందన్నారు. అన్ని వర్గాలకూ ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. అర్హతే ప్రామాణికం తప్ప పైరవీలు, సిఫార్సులకు తావు లేకుండా పథకాలు అందిస్తున్నట్టు తెలిపారు. ప్రజలకు మేలు చేశాం కాబట్టే నిర్భయంగా ప్రజల్లోకి వెళ్లగలుగుతున్నామన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వులవకాయల నాగ లోవరాజు, ఎంపీపీ అరిగెల అచ్చియ్యమ్మ, వైఎస్సార్ సీపీ నేతలు అరిగెల రామయ్యదొర, కడింశెట్టి భాస్కర రెడ్డి, పలువురు వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

తప్పుడు ఆరోపణలు తగవు


మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ సురేష్‌కుమార్

కొత్తపల్లి: పార్టీ నాయకుడిగా పని చేస్తూ పార్టీకి చెందిన ఎమ్మెల్యేపై తప్పుడు ఆరోపణలు చేయడం తగదని వైస్ ఎంపీపీ చెట్టుబత్తిన సురేష్‌కుమార్ అన్నారు. కొమరగిరిలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. గ్రామ సర్పంచ్ కందేపల్లి సత్యశ్రీ తండ్రి, మాజీ ఎంపీటీసీ కందేపల్లి నూకరాజు స్థానిక నాయకులు, అధికారులతో విభేదాలకు దిగుతూ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఆరోపించారు. రెండుసార్లు ఎంపీటీసీ సభ్యుడిగా పని చేసి కూడా నూకరాజు గ్రామాన్ని అభివృద్ధి చేసిన దాఖలాలు లేవన్నారు. గ్రామంలో అనివార్య కారణాలతో ఇళ్ల స్థలాల పంపిణీ నిలిచిపోయిందని, ఈ విషయాన్ని ఎమ్మెల్యే పెండెం దొరబాబు దృష్టికి సర్పంచ్ సత్యశ్రీ తీసుకువెళ్లగా అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తామంటూ ఆయన హామీ ఇచ్చారని గుర్తు చేశారు. మార్కెట్ యార్డు డైరెక్టర్ నురుకుర్తి వెంకటలక్ష్మి మాట్లాడుతూ గ్రామం అభివృద్ధి చెందకుండా సర్పంచ్‌ను నూకరాజు అన్ని విధాలా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. మాజీ సర్పంచి సోమరాజు మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పశువుల ఆస్పత్రి ప్రహరీ నిర్మాణానికి ఎమ్మెల్యే దొరబాబు రూ.10 లక్షలు మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో కొమరగిరి పీఏసీఎస్ అధ్యక్షుడు గుళ్లపల్లి సత్యనారాయణ, గ్రామ సచివాలయ కన్వీనర్ దాసరి పెద కాపు తదితరులు పాల్గొన్నారు.

చంద్రరావుకు సముచిత స్థానం

సామర్లకోట: టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన మన్యం చంద్రరావుకు సముచిత స్థానం కల్పిస్తామని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. సోమవారం స్థానిక పార్టీ క్యాంపు కార్యాలయం నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో రాజకీయంగా ఎంతో అనుభవం ఉన్న చంద్రరావు సేవలను పార్టీ పూర్తిగా వినియోగించుకుంటుందన్నారు.

డివిజన్ స్థాయి స్పందనకు 14 అర్జీలు


స్పందనలో అర్జీ స్వీకరిస్తున్న ఆర్డీఓ సీతారామారావు

పెద్దాపురం: ప్రతివారం నిర్వహించే డివిజన్ స్థాయి స్పందనలో భాగంగా సోమవారం పెద్దాపురం రెవెన్యూ డివిజన్ కార్యాలయానికి అర్జీదారులు క్యూ కట్టారు. పెద్దాపురం టిడ్కో గృహాల్లో పారిశుధ్య నిర్వహణ బాగోలేదని, కిర్లంపూడి మండలం గెద్దనాపల్లిలో ఇళ్ల స్థలాలిచ్చినా ఇళ్లు మంజూరు కాలేదని, మండలంలోని దివిలిలో వివాద స్థలంలో అక్రమణ షెడ్డు నిర్మాణానికి విద్యుత్ కనెక్షన్లు ఎలా ఇచ్చారని, తదితర సమస్యలపై అర్జీ దారులు డివిజన్ స్థాయి గ్రీవెన్స్‌ను ఆశ్రయించారు. డివిజన్‌లో ఆయా మండలాల నుంచి వివిధ సమస్యలపై 14 అర్జీలు అందినట్లు ఆర్డీఓ జె.సీతారామారావు తెలిపారు. దివిలిలో వివాద స్పద స్థలంలో విద్యుత్ కనెక్షన్ ఎందుకు మంజూరు చేశారంటూ కొత్తెం కోటి, మా భూమికి పట్టాదారు పాస్ పుస్తకం కావాలని ఒకటి, భూ తగాదా పరిష్కరించాలని, ఆక్రమణలు తొలగించాలని, భూ సర్వే చేయించి తమకు న్యాయం చేయాలని తదితర సమస్యలపై 14 ఫిర్యాదులు అందినట్లు ఆర్డీఓ వెల్లడించారు. డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతి అర్జీని ఆయా శాఖకు బదిలీ చేసి సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ఈ వారం వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత శాఖాధికారులకు ఆదేశించినట్టు ఆర్డీఓ తెలిపారు. డీఎల్‌పీఓ బాలామణి, డీటీ భానుకుమార్, మున్సిపల్ మేనేజర్ జ్యోతిరాణి, ఏడీఏ దైవకుమార్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం


కొమరగిరిలో పౌష్టికాహారంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కొత్తపల్లి: గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మార్తమ్మ అన్నారు. కొమరగిరిలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన న్యూట్రిషన్ స్టాల్‌ను సర్పంచ్ కందేపల్లి సత్యశ్రీ, ఎంపీడీఓ పి.వెంకటనారాయణతో కలిసి ఆమె పరిశీలించారు. శిబిరానికి హాజరైన గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

సీఐ రవికుమార్ బాధ్యతల స్వీకరణ

పెద్దాపురం: పెద్దాపురం సీఐగా వై.రవికుమార్ సోమవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు సీఐగా పనిచేసిన నబీ ఎన్‌టీఆర్ జిల్లా తిరువూరు బదిలీ కావడంతో ఆయన స్థానంలో విజయవాడ క్రైం సీఐగా పనిచేస్తున్న రవికుమార్ ఇక్కడికి బదిలీపై వచ్చారు. రవికుమార్ గతంలో సబ్ డివిజన్ పరిధిలోని ఏలేశ్వరం, ప్రత్తిపాడు సబ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తించి 2017లో మారేడుమిల్లి సీఐగా పదోన్నతిపై బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం సీఐ రవికుమార్ డీఎస్పీ లతాకుమారిని, ఎస్పీ సతీష్ కుమార్‌లను మర్యాద పూర్వకంగా కలిసేందుకు వెళ్లారు.

దొరబాబును కలసిన సీఐ

సామర్లకోట: పెద్దాపురం సీఐగా బాధ్యతలు స్వీకరించిన రవికుమార్ సోమవారం సాయంత్రం రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబును మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. సామర్లకోటలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో దొరబాబును కలిసి పరిచయం చేసుకున్నారు. పెద్దాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి, పెద్దాపురం జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం


బాల్య వివాహ నిర్మూలిద్దామని ప్రతిజ్ఞ చేస్తున్న జిల్లా మహిళా సమాఖ్య సభ్యులు

సామర్లకోట: బాల్య వివాహ రహిత సమాజాన్ని నిర్మించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ అదనపు సీఈఓ విజయలక్ష్మి, డైరెక్టర్ శ్రీనివాసులు అన్నారు. బాల్య వివాహ రహిత భారత్ కార్యక్రమం నిర్వహణలో భాగంగా సోమవారం స్థానిక టీటీడీసీలో జిల్లా మహిళా సమాఖ్య సభ్యులచే వారు బాపట్ల, ఏలూరు, గుంటూరు, కాకినాడ, కృష్ణా, ఎన్టీఆర్, పలనాడు, ప్రకాశం, పొట్టి శ్రీరాములు నెల్లూరు, పశ్చిమ గోదావరి జిల్లాలోని మహిళా సమాఖ్య సభ్యులచే ఆన్‌లైన్‌లో ప్రతిజ్ఞ చేయించారు. బాల, బాలికలను సమానంగా చూస్తానని, బాలికా విద్యను మధ్యలో నిలిపివేయనని, 18 ఏళ్లు నిండిన తరువాతే బాలికలకు వివాహం చేస్తానని, బాల్య వివాహలు తన దృష్టికి వస్తే వాటిని నిరోధించడానికి తన వంతు ప్రయత్నం చేస్తానని, దీనిపై అందరిలోను చైతన్యం తీసుకు వస్తానని ప్రతిజ్ఞ చేయించారు. వైఎస్సార్ క్రాంతి పథం డీపీఎంలు వెంకటేశ్వరరావు, కేశవ్, రాయ్, బాబూరావు, ఏపీఎంలు ఎస్.వేద కుమారి, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు డి.సంధ్యారాణి, కార్యదర్శి కె.గంగతల్లి, ఉపాధ్యక్షురాలు వి.కాంచన, సహాయ కార్యదర్శి మోర్త కుమారి, కోశాధికారి కె.సుమిత్ర పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్యసేవలే ప్రభుత్వ లక్ష్యం

ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు


జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను పంపిణీ చేస్తున్న దొరబాబు

పెద్దాపురం: ప్రతి ప్రతి కుటుంబాన్ని జల్లెడ పట్టి ప్రతి గడప వద్ద ప్రజల ఆరోగ్య సమస్యలను గుర్తించి ప్రతి ఒక్కరికి నాణ్యమైన వైద్యం అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా సోమవారం మండలంలోని ఆర్బీ కొత్తూరు గ్రామంలో ఉప సర్పంచ్ గోలి రామారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దొరబాబు మాట్లాడుతూ ప్రతి ఇంటికీ వెళ్లి ఆరోగ్య సమస్యలు తెలుసుకుంటున్న ప్రభుత్వం వైఎస్సార్ సీపీయేనన్నారు. ప్రజల ఆరోగ్య సమస్యలు గుర్తించి తగు వైద్యం అందించడంతో పాటు గర్భిణులు, బాలింతలు, రక్తహీనత బాధితులపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్న ప్రభుత్వం జగనన్న ప్రభుత్వమన్నారు. జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ వల్లూరి జ్యోతి, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ మాట్లాడుతూ సురక్ష సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తొలుత హౌసింగ్ చైర్మన్ దొరబాబు రిబ్బన్ కట్ చేసి వైద్య సేవలను ప్రారంభించారు. గృహ సారథుల మండల కన్వీనర్ గోపు మురళి, పంచాయతీ కార్యదర్శి జ్యోతుల పద్మరాజు, సర్పంచ్ అద్దాల మరియమ్మ, పార్టీ నాయకులు యంద్రు సత్తిబాబు, పల్లా శ్రీనివాస్ యాదవ్, వల్లూరి కుట్టయ్యచౌదరి, గోలి రామకృష్ణ, జయబాబు వైద్య సిబ్బంది, వలంటీర్లు సిబ్బంది పాల్గొన్నారు.

సురక్షతో ప్రజలకు మెరుగైన వైద్యం

కొత్తపల్లి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని వైస్ ఎంపీపీ చెట్టుబత్తిన సురేష్‌కుమార్ అన్నారు. మండలంలోని కొమరగిరి జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సర్పంచ్ కందేపల్లి సత్యశ్రీ ప్రారంభించారు. కొమరగిరి పీహెచ్‌సీ వైద్యాధికారి రాజ్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది 425 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. గ్రామీణ ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అనంతరం రోగులకు ఆరోగ్య కిట్లు పంపిణీ చేశారు. సీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.